ఉష్ణోగ్రత : గరిష్ఠం 39.0 కనిష్ఠం 17.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:30 (మంగళవారం సాయంత్రం)
సహర్: 5:05 (బుధవారం ఉదయం)



హోమం నిర్వహిస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని వేంకగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల ఐదో రోజు సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు, చక్రతీర్థం, పూర్ణాహుతి, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రాధాకృష్ణశర్మ, అనిల్ జోషి, జానకిరామయ్య, ఆనందశర్మ, నిహాల్‌జోషి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి

7

రైతుల సమస్యలు పరిష్కరించాలి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

7



జీవాలకు మేతగా మారిన ఎండిన వరి పైరు

క/ద రువు!

నీరందక నెర్రెలు బారుతున్న వరి పొలాలు

వేసవి మొదట్లోనే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఎండ తీవ్రతకు గంగమ్మ పాతాళానికి చేరడంతో బోర్లు వట్టిపోతున్నాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసిన వరి పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. యాసంగిలో వేసిన పంటను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. నీటి లభ్యత లేకపోవడంతో ఎండిన పైర్లు జీవాలకు మేతగా మారాయి. సాగుకు చేసిన అప్పును ఎలా తీర్చాలని అన్నదాతలు లబోదిబోమంటున్నారు.



నీరులేక నెర్రెలు బారిన వరి చేను

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బోర్లు.. జీవాలకు మేతగా పైర్లు
- ఆందోళనలో అన్నదాతలు

మంచాల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మంచాల మండలంలో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఈ ఏడాది అంతంతమాత్రంగానే వానలు కురవడంతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండటంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లన్నీ వట్టిపోతున్నాయి. పొట్టదశకు వచ్చే పరిస్థితిలో ఉన్న వరిపైర్లకు నీరందే పరిస్థితి లేక కళ్ల ముందే ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకోలేక

మిగతా 8వ పేజీలో...

రూ.200కు గడ్డిమోపు కొంటున్నం



నీటి లభ్యత లేకపోవడంతో పచ్చిగడ్డి దొరకడం లేదు. నాకు ఆరు గేదెలున్నాయి. దసరా నుంచే ఎండుగడ్డి కొని మేపుతున్నాం. ఇంకా మూడు నాలుగు నెలలు గడిస్తేగానీ వానాకాలం రాదు. అప్పటివరకు కష్టమే. గడ్డిమోపు రూ.200 పెట్టి కొంటున్నం. రోజుకు రెండు కట్టలు మేస్తున్నాయి. దాణా కూడా పెడుతున్న. గడ్డి కోసం అప్పులు చేస్తున్న. ఏం మిగుల్తలేదు.

-నాంపల్లి వెంకటేష్, రైతు, తిప్పాయిగూడ



ప్రజల సమస్యలను వింటున్న డీఆర్వో సంగీత

ప్రజావాణికి 62 ఫిర్యాదులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 62 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 29, ఇతర శాఖలవి 33 విజ్ఞప్తులు వచ్చినట్లు తెలిపారు.

'ఫ్యూచర్‌సిటీ' అథారిటీలో ఆ గ్రామాలను కలపాలి

యాచారం : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్‌సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, కేశితండా గ్రామాలను కలపాలని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌వో సంగీతకు వినతిపత్రం అందజేశారు. ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఈ మూడు గ్రామాలను కలపకపోవడంలో ఆంతర్యమేమిటని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. మండలంలోని అన్ని గ్రామాలను కలిపి అభివృద్ధి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మేకల యాదగిరిరెడ్డి, కొలన్ బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విజయ్‌కుమార్ రెడ్డి

యాచారం, మార్చి10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు ఎక్కడా లేవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తెలిపారు. యాచారం మండలం నానక్‌నగర్‌లో ఆదివారం 12వేల బాయిలర్ కోళ్ల మృతిపై ఆయన స్పందించారు. నానక్‌నగర్‌లో కోళ్లు కొక్కెర వ్యాధితో చనిపోయాయని వివరించారు. చికెన్ డీప్‌ఫ్రై చేసి నిర్భయంగా తినొచ్చని చెప్పారు. మేడిపల్లి పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ నానక్‌నగర్ గ్రామాన్ని సందర్శించి కోళ్లకు సోకుతున్న వ్యాధులపై పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఎక్కడైనా కోళ్లు చనిపోతే తమ సిబ్బందికి సమాచారమందించాలని కోరారు.



మొయినాబాద్‌లో మాట్లాడుతున్న నాయకులు

నేడు మెగా జాబ్‌మేళా

మొయినాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగ జాబ్‌మేళాను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, మొయినాబాద్ పీఏసీఎస్ చైర్మన్ మండాడి చంద్రారెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోడ జంగయ్య తెలిపారు. సోమవారం మొయినాబాద్ మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. మంగళవారం (11వ తేది) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చేవెళ్ల పట్టణంలోని కేజీఆర్ గార్డెన్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్ పాస్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన మహిళలు అర్హులని తెలిపారు. 18 సంవత్సరాల వయసు పైబడిన మహిళలు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కావలి రమేశ్, సత్యనారాయణ, బాబన్న, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మహేందర్, రాజుగౌడ్, రాజేశ్‌గౌడ్, విజయరాజ్, తలారి నరేశ్, జగన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహ, చాకలి రాజేంద్ర, మురళి, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి విజయరాజ్ తదితరులు ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ గురుకులానికి రూ.200 కోట్లు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

7



నిరుపయోగంగా బీసీ హాస్టల్ భవనం

శిథిలావస్థలో ఆమనగల్లు వసతి గృహం

- కోట్ల రూపాయల విలువ చేసే స్థలం అన్యాక్రాంతమయ్యే ప్రమాదం
- వసతులు కల్పించక, పిల్లలు లేరని ఆరేళ్ల క్రితం హాస్టల్ ఎత్తివేత
- బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని స్థానికుల విన్నపం



శిథిలావస్థలో బీసీ వసతి గృహం

ఆమనగల్లు, మార్చి10(ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఆమనగల్లు బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆరేళ్ల క్రితం ఎత్తివేశారు. వసతి గృహాన్ని ఎందుకు ఎత్తివేశారో ఇప్పటికీ అర్థం కాని పరిస్థితి. అయినా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు. బీసీ వసతి గృహాన్ని తిరిగి పునరుద్ధరించాలని, లేదంటే దాని స్థానంలో బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్, వెల్దండ మండలాల బీసీ విద్యార్థుల కోసం నాలుగు దశాబ్దాల క్రితం బీసీ వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ వెనుక మాడ్గుల రోడ్డును అనుసరించి విశాల భవనం నిర్మించారు. అప్పట్లో సుమారు 200 మంది విద్యార్థుల వరకు వసతి గృహంలో ఉంటూ స్థానిక వివిధ పాఠశాలల్లో చదువుకునేవారు. పేద పిల్లలకు వసతి గృహం ఎంతో సౌకర్యంగా ఉండేది. కాగా ప్రజాప్రతినిధులు, అధికారుల ఉదాసీన వైఖరితో వసతి గృహంలో సమస్యలు పేరుకుపోయాయి. భవనం శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఉన్న విద్యార్థులలో కూడా

మిగతా 8వ పేజీలో...

సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి



ఆమనగల్లు పట్టణంలో నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్ భవనం స్థానంలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి. బీసీ విద్యార్థులు అధికంగా ఉన్న ఆమనగల్లు ప్రాంతంలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం పాలక ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలి. బీసీ వసతి గృహం ఎత్తివేయడంతో ఏళ్ల కాలంగా పేద విద్యార్థులు వసతి లేక చదువు కోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

- నాగిళ్ల జగన్, ఆమనగల్లు

ఎవరూ పట్టించుకోవడం లేదు



బీసీ బాలుర వసతి గృహ భవనాన్ని వినియోగంలోకి తేవాలి. బీసీ వసతి గృహం స్థానంలో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలి. ఆరేళ్ల క్రితం పిల్లలు లేరన్న సాకుతో హాస్టల్‌ను ఎత్తివేశారు. ఆ తర్వాత భవనం గూర్చి ఎవరు పట్టించుకోవడం లేదు. ఆమనగల్లు పట్టణంలోని బీసీ హాస్టల్ భవనాన్ని మరమత్తు చేసి వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- లండం మల్లేశ్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఆమనగల్లు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న బొక్క నర్సింహారెడ్డి

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం హైవే, బెంగుళూరు హైవేలకు సమాంతరంగా పెద్దగోల్కొండ నుంచి మిడ్జిల్ వరకు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి వినతి పత్రం సమర్పించారు. వినతి చేసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు

నోటిఫికేషన్లు ఆపాలి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గకరణను అమలు చేసేవరకు ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయొద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నర్సింహ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు షాద్‌నగర్ మండల పరిషత్ ఎదుట సోమవారం నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణను చేపట్టాలన్నారు. అప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి నోటిఫికేషన్లను విడుదల చేయొద్దని డిమాండ్ చేశారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగభూషణ్ మాదిగ, బి. పాండు మాదిగ, ఎం. శ్రీనివాస్‌మాదిగ, జాంగారి జంగయ్యమాదిగ, సురేష్‌మాదిగ, చెరుకుపల్లి శ్రీనుమాదిగ, దశరథ్‌మాదిగ, ప్రేమ్‌కుమార్‌మాదిగ, కె.శివకుమార్‌మాదిగ, మధుమాదిగ, నర్సింహులు, బాల్‌రాజ్‌మాదిగ, కృష్ణయ్యమాదిగ, పవన్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న నర్సింహ



ఈడీ పద్మావతికి శుభాకాంక్షలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్న పద్మావతిని పీసీసీ క్యాంపెయిన్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పూల మొక్కను అందించారు.

గందరగోళంగా జేపీ దర్గా టెండర్

- టెండర్ ధరను రెట్టింపు చేసిన వక్ఫ్‌బోర్డు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు



కొత్తూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేరుగాంచిన దర్గాలో ఒకటైన మండల పరిధి ఇన్ముల్‌నర్వలో గల హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా టెండర్ గందరగోళంగా మారింది. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు దర్గా టెండర్ విలువను రెట్టింపు చేయడంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో టెండర్ ప్రక్రియ నిలిచిపోయింది. గతంలో దర్గా టెండర్ కోటిన్నర నుంచి రెండు కోట్ల వరకు పలుకగా, దర్గా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వక్ఫ్‌బోర్డు రూ.4కోట్ల మినిమం ధరగా నిర్ణయించింది. టెండర్ కోసం నోటిఫికేషన్ జారీచేయగా, దుకాణాల కాంట్రాక్ట్‌కు ఒక్కరూ దాఖలు చేయలేదు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యహరిస్తూ దర్గా టెండర్‌ను రెట్టింపు చేయడం సరికాదని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జేపీ దర్గా టెండర్‌పై ప్రభుత్వం స్పందించి నిర్ణయం తీసుకోవాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలి


వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలని కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తగ్గి ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలోని బోర్లకు మరమ్మతులు చేయించి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో పారి శుధ్య పనులు కొరవడినందున తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ముత్యాలు, రాధాకృష్ణ, జంగయ్య, వెంకటేష్, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, చిత్తారి, మల్లేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

కీసర రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వేతనాలు చెల్లించాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. సకాలంలో వేతనాలివ్వక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే అరకొర వేతనాలైనా నెలనెలా చెల్లించక నిత్యావసర వస్తువుల కొనుగోళ్లకు అప్పు చేస్తున్నామని వాపోయారు. మూడు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. జీతాలు నెల నెలా ఇవ్వాలన్ని కమిషనర్‌ను కోరగా దాటవేస్తూ వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు సకాలానికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం, మార్చి10(ఆంధ్రజ్యోతి):ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని కాలనీల్లో డ్రైనేజీ సమస్య ఉందని, యూజడీ ఏర్పాటుతోపాటు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామేల్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. బృందావన్ కాలనీ, త్రిశక్తినగర్‌లో వీధిలైట్లు వెలగడం లేదన్నారు. పేదలకు రేషన్ కార్డులివ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హులను గుర్తించాలన్నారు. సీపీఎం మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ్, నాయకులు మునలయ్య, పురుషోత్తం, శంకర్, వీరేశం, యాదగిరి ఉన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, స్థానికులు

వందశాతం పన్నులు వసూలు చేయాలి


ట్యాక్స్ వసూళ్లపై అధికారులతో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ సంధ్య

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట్ మున్సిపల్ పరిధిలో ఎక్కడా ప్రజలకు తాగునీటి సరఫరాలో నీటిఎద్దడి లేకుండా చూడాలని తూంకుంట మున్సిపల్ స్పెషలాఫీసర్ సంధ్య అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తూంకుంట మున్సిపల్ పరిధిలో మున్సిపల్ స్పెషలాఫీసర్ సంధ్య మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలసి పర్యటించారు. వేసవి తీవ్రం అవుతున్న దృష్ట్యా వివిధ ఎక్కడా ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని, అందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని కమిషనర్ వెంకటగోపాల్‌కు, సిబ్బందికి సూచించారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో స్పెషలాఫీసర్ పర్యటిస్తూ ట్యాక్స్ వసూళ్లపై శ్రద్ధ తీసుకొని వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ పరిధి హకీంపేట సీఐఎస్ఎఫ్ క్యాంపస్‌లలో స్పెషలాఫీసర్ మొక్కలు నాటారు. డీఆర్‌సీ సెంటర్‌ను, బయోమైనింగ్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ సంధ్య మాట్లాడుతూ మున్సిపల్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వస్తున్న ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ సునీత, ఆర్‌ఓ హర్షద్ అహ్మద్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి సన్మానం



చేవెళ్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.పద్మావతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. సోమవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో పీసీసీ క్యాంపెయిన్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న కార్పొరేషన్ రుణాలను లబ్ధిదారులకు సకాలంలో అందించి ఆర్థిక చేయూతనివ్వాలని ఈ సందర్భంగా ఈడీని కోరామని వసంతం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రిలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృడత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ రాజేష్‌పటేల్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, బంధులాల్, మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఖలీల్, ఆంజనేయులు, వేణు, వీరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


టాస్‌వేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఉన్నత ప్రమాణాలతో గురుకులాల ఏర్పాటు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకుడు రఘునాయక్ అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేద పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యనందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రూ.11వేల కోట్లతో 55యంగ్ ఇండియా రీజినల్ పాఠశాలలను నిర్మిస్తుందని తెలిపారు. కొందుర్గులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా పాఠశాలకు రూ.200కోట్లు కేటాయించారని తెలిపారు. ఒక్కో పాఠశాలలో 120మంది ఉపాధ్యాయులు పనిచేస్తారని, సకల సౌకర్యాలతో పాఠశాల భవన నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఇబ్రహీం, అగ్గనూరి బస్వం, వెంకట్‌రెడ్డి, హైదర్ ఘోరి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రఘునాయక్

పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ సర్వే


శాంపిల్ సర్వే నిర్వహిస్తున్న నిర్వాహకులు

ధారూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ధారూరు, ఎబ్బనూర్, మైలారం, అల్లాపూర్, ఊరేంటా తండా పాఠశాలల్లో సోమవారం రాష్ట్రస్థాయి ఎఫ్ఎల్ఎన్(మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధన) ఫైనల్ శాంపిల్ సర్వేను నిర్వహించారు. పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల్లో తెలుగు, ఆగ్లం, గణిత సామర్థ్యాలను పరిక్షించే కార్యమంలో భాగంగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామ్ మస్తాన్ ఆధ్వర్యంలో ఈ సర్వే చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 12వ తేదీ వరకు సర్వేను నిర్వహిస్తున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ టీం తయారుచేసిన పరీక్షాంశాలను రోజుకొక సబ్జెక్ట్ చొప్పున డీఈడీ, బీఈడీ ఛాత్రోపాధ్యాయులు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తూ పఠన, రాతాంశాలను పరీక్షించి ఆన్‌లైన్‌లోని సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్
నూతన కార్యవర్గం ఎన్నిక


జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా కల్లెపల్లి రవిచంద్ర, ప్రధానకార్యదర్శిగా పాక రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఉప్పల్‌పల్లిలోని జిల్లా ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశానికి ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు కోలా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.నూతన కమిటీలో దేశం కృష్ణాగౌడ్ కోశాధికారిగా, తుమ్మ రవికిరణ్‌రెడ్డి, పన్నాల బాల్‌రెడ్డి ఉపాధ్యక్షులుగా, పి.రామకృష్ణ, రేణుయాదవ్ సహాయ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రామారావు, శ్రీరాములు నియమితులయ్యారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి ఎం.వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టి.మల్కయ్య, రచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాండూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎండలు పెరిగిపోయి ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటిపోతుండగా మరోవైపు ఇసుక అక్రమార్కులు యాలాల మండలం యాలాల, గోవింద్‌రావుపేట తదితర ప్రాంతాల్లో కాగ్నా నది నుంచి పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. యాలాల రెవెన్యూ కార్యాలయంలో ఇసుక పర్మిట్లు పొంది అదే పర్మిట్లపై వందలాది ఇసుక ట్రాక్టర్లను రవాణా చేస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ నుంచి అధికారులు రూ.2వేల చొప్పున మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఒక పర్మిట్ పొంది అదే పర్మిట్‌పై ఇసుక ట్రాక్టర్లను ఇష్టానుసారం ఇసుక రవాణా చేస్తున్నారు. శనివారం రాత్రి యాలాల మండలంలో ఇసుక రవాణా జరుగుతోందని పోలీసు ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దింపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఏడు ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. మరో ఐదు ట్రాక్టర్ల డ్రైవర్లు తప్పించుకున్నట్లు సమాచారం. ఏడు ఇసుక ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఇసుక ట్రాక్టర్లను విడిపించేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు ప్రయత్నాలు చేశారు. అక్రమ ఇసుక రవాణాను అరికడుతామని ఓ వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతుండగా మరో వైపు సీఎం నియోజకవర్గం కొడంగల్‌కు సమీప యాలాల మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కాగా పట్టుకున్న ఏడు ట్రాక్టర్లలో నాలుగింటిలో మాత్రమే ఇసుక ఉందని, ఆ ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసి రెవెన్యూ శాఖకు బైండోవర్ చేశామని ఎస్ఐ గిరి చెప్పారు.


టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

కరన్‌కోట్ గ్రామాన్ని సందర్శించిన అధికారులు

తాండూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో వేసవి కాలం దృష్ట్యా తీవ్ర నీటిఎద్దడి తలెత్తింది. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదని గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులైన మాజీ ఎంపీపీ శరణబసప్ప, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ జర్నప్ప తదితరులు ఇటీవల తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన దేఆల మేరకు ఎంపీడీవో విశ్వప్రసాద్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావు సోమవారం గ్రామాన్ని సందర్శించారు. తాగు నీటి సమస్యపై గ్రామస్థులతో మాట్లాడారు. కాగ్నా నది నుంచి నీటిని కరన్‌కోట్ గ్రామంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారి వెంట మాజీ ఎంపీపీ శరణబసప్ప, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ జర్నప్ప ఉన్నారు.


బావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ప్రణాళికాబద్ధంగా పరిగి అభివృద్ధి

పరిగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పరిగి నియోజకవర్గాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పరిగిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రోడ్ల వెడల్పునకు రూ.340కోట్ల మంజూరయ్యాయని తెలిపారు. రూ.120కోట్లతో పరిగి-షాద్‌నగర్, రూ.120కోట్లతో పరిగి-వికారాబాద్, రూ.100కోట్లతో గడిసింగాపూర్-రంగారెడ్డిపల్లి రోడ్డు వెడల్పు పనులకు మంగళవారం శంకుస్థాపన చేస్తామని తెలిపారు. పట్టణ శివారు కొత్తకుంట అభివృద్ధికి రూ.29లక్షలతో పనులు చేస్తామన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే బడ్జెట్‌లో పరిగి, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు నిధులు మంజూరు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. ట్రిపుల్ ఆర్ పరిగి నియోజకవర్గం మీదుగా వెళ్తుందన్నారు. హెచ్ఎండీఏ పరిధిని పూడూరు మండలం మన్నెగూడ వరకు పొడిగించామని తెలిపారు. పరిగి మీదుగా కృష్ణా రైల్వేలైన్‌కు రూ.8కోట్లతో సర్వే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా పథకాల లబ్ధిదారుల ఎంపిక చేస్తామని తెలిపారు. ఇందుకు మంగళవారం స్టేడియం మైదానంలో సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, వైస్‌చైర్మన్ అయ్యూబ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

పరిగి శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం 8గంటలకు విశ్వక్సేన ఆరాధన, కంకనధారణం, దేవయజ్ఞం, చండీహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చండీహోమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి-ఉమారెడ్డి దంపతులు కూర్చున్నారు. హోమం అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

విద్యుత్ అధికారులు రైతుల సమస్యలు పరిష్కరించాలి

చేవెళ్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందిపడుతున్నా విద్యుత్ అధికారులు స్పందించడం లేదని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం చేవెళ్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలా మంది రైతులు నూతన విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టి అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదన్నారు. పొలాల్లో కిందికి వేలాడుతున్న కరెంటు వైర్లతో పశువులు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేశం, కృష్ణారెడ్డి, విశ్వనాథం, శంకర్‌సింగ్, జితేందర్‌సింగ్ రైతులు పాల్గొన్నారు.

తప్పుడు పర్మిట్లతో ఇసుక దోపిడీ

సీసీ రోడ్లు, స్కూళ్లలో పనులంటూ రవాణా

అధికారులను బోల్తాకొట్టించి అనుమతులు ● కాగ్నా నుంచి ఇసుక తోడి ప్రైవేట్‌గా అమ్మకాలు

తాండూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనుల పేరిట నామమాత్ర రుసుం చెల్లించి కాగ్నా నది నుంచి ఇసుక తోడి ప్రైవేట్ నిర్మాణాలకు డంప్ చేస్తూ డబ్బులు దండుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసు, అధికారుల కళ్లుగప్పి కొందరు ఇసుక అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. తాండూరు మండలం ఖాంజాపూర్ సమీప కాగ్నా నది నుంచి ఖాంజాపూర్‌నకు చెందిన కొందరు పెద్దేముల్ మండలం ఖానాపూర్‌లో సీసీ రోడ్డు పనులకంటూ ఇసుక తరలిస్తున్నారు. అయితే రోడ్డు పూర్తయి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభోత్సవం సైతం చేశారు. అయినా అదే సీసీ రోడ్డుకంటూ పర్మిట్ పొంది కాగ్నా నుంచి ఇసుక తోడి ప్రైవేట్‌గా అమ్ముకుంటున్నారు. ఖానాపూర్‌లో రూ.4లక్షలతో సీసీ రోడ్డు వేసి నెలరోజులైంది. అక్రమార్కులు తహసీల్దార్ కార్యాలయంలో ఖానాపూర్ పేరిట పర్మిట్లు పొంది కాగ్నా నది నుంచి ఐదు ట్రాక్టర్లతో రోజుకు 16ట్రిప్పుల ఇసుక తోడి ప్రైవేట్‌గా అమ్మేసుకుంటున్నారు. తహసీల్దార్ తారాసింగ్ పర్మిటిచ్చే సమయంలో గ్రామానికి వెళ్లి పరిశీలించాల్సి ఉన్నా ఆయన పనులను చూడకుండానే అనుమతులిచ్చేశారు. దీంతో అక్రమార్కులు సోమవారం సీసీ రోడ్డు పేరిట కాగ్నా నుంచి ఐదు ట్రాక్టర్లతో 16 ట్రిప్పుల ఇసుకను తీసుకెళ్లారు. ఖాంజాపూర్‌నకు చెందిన మరో ట్రాక్టర్ యాలాల మండలం బషీర్‌మియాతండాలో పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం పేరిట అనుమతి పొంది తండాకు చెందిన ఓ నాయకుడి ఇంటి వద్ద డంప్ చేసింది. ఈ విషయంపై విలేకరులు ఖాంజాపూర్ గేటువద్ద ట్రాక్టర్ల అనుమతులను పరిశీలించగా వారి అక్రమాలు వెలుగులోకొచ్చాయి. దీనిపై తాండూరు సబ్‌కలెక్టర్‌కు సమాచారమిచ్చారు. ఆయన రెవెన్యూ అధికారులను చర్యల కోసం పురమాయించారు. ఇలా ఏదో ఒకచోట సీసీ రోడ్లనో, స్కూళ్లలో మరమ్మతులనో అనుమతులు పొంది ఇసుకను అమ్ముకుంటున్నారు.


ప్రొసీడింగ్ కాపీ చూపుతున్న తహసీల్దార్ తారాసింగ్


బషీర్‌మియాతండా పాఠశాల పేరిట ఓ ఇంటి ముందు డంప్ చేస్తున్న ఇసుక

అధికారుల పట్టింపు లేకనే...

ఇదిలా ఉంటే అభివృద్ధి పనులకంటూ కాగ్నా నదీ పరివాహక ప్రాంతాల నుంచి రోజూ వందలాది ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. అయితే రెవెన్యూ, మైన్స్, పోలీసు అధికారులు పట్టించుకోకే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఖాంజాపూర్ కాగ్నా నది నుంచి ఇసుక పర్మిట్లను రద్దుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా తప్పుడు సమాచారంతో అనుమతిపొంది ప్రైవేట్ అవసరాలకు ఇసుక తరలిస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. సీసీ రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం కోసమని ఇసుక తరలింపునకు దరఖాస్తు చేశారని, అది నమ్మి తాము పర్మిట్లు ఇచ్చామని చెప్పారు. సోమవారం విలేకరుల తనిఖీల్లో తప్పుడు సమాచారం ఇచ్చి పర్మిట్లు పొందినట్లు రుజువైందన్నారు. ఇలా అధికారులను, ప్రభుత్వాన్ని బోల్తాకొట్టించి పర్మిట్ పొందిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్ చెప్పారు.



కాగ్నా నది నుంచి ఖానాపూర్‌నకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

తాగునీటి పైపులైన్లలో చెట్ల వేర్లు

బొంరాస్‌పేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 25 సంవత్సరాల కిందట వేసిన పురాతన సిమెంట్ పైపులైన్లలో చెట్ల వేర్లు రావడంతో తాగునీటి సరఫరాకు అడ్డంకిగా మారింది. మండల కేంద్రంలో పురాతన కాలం నాటి పైపులైన్‌ల జాయింట్‌లు వదులు కావడంతో ఎక్కడపడితే అక్కడ చెట్ల వేర్లు విస్తరించి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ అధికారి వెంకటయ్య సిబ్బందితో కలిసి సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు పైపులైన్‌ను తవ్వి చూడగా పైపునిండా 20మీటర్ల మేర పొడవు చెట్ల వేర్లు పేరుకుపోయాయి. కాలంచెల్లిన పైపులతో ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.


పైపులో పేరుకున్న వృక్షాల వేర్లు

పంట కాల్వ పరిశీలన

బొంరాస్‌పేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ పెద్ద చెరువు కాల్వ, ఏటి కాల్వలకు రూ.4కోట్లు మంజూరైనట్లు ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈఈ జోసెఫ్ ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు సోమవారం పెద్ద చెరువు కింద పంట కాల్వలతో పాటు చెరువులోకి వచ్చే ఏటి కాల్వను పరిశీలించారు.


సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శుభప్రద్‌పటేల్

మహిళలకు విద్యాప్రదాత సావిత్రీబాయి పూలే

వికారాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విద్యకు నోచుకోక వివక్షకు గురవుతున్న మహిళల కోసం దేశంలోనే మొదటిసారి మహిళా పాఠశాలను నెలకొల్పి విద్యనందించిన మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఎన్.శుభప్రద్‌పటేల్ అన్నారు. సోమవారం వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని వికాస్ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పూలే దంపతులు అంటరానితనం, సతీసహగమనం వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కృషిచేశారన్నారు. బడుగుల అభ్యున్నతికి జీవితాంతం పాటుపడ్డారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఫోరం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేడు మహిళల్లో చైతన్యం వచ్చిందంటే నాడు సావిత్రిబాయి పూలే చేసిన పోరాటాలు, కృషి ఫలితమే అన్నారు. వారిని సమాజం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వికారాబాద్‌లో పూలే దంపతుల విగ్రహాలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు కె.మారుతి, ఎన్.దేవదాస్, మానిక్‌రెడ్డి, ఎం.దేవదాస్, తిరుపతిరెడ్డి, దత్తు, సుజిత్, సురేష్, సిద్ధికి, అఖిల్ పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ గురుకులం

ఆమనగల్లు, మార్చి10(ఆంధ్రజ్యోతి): అంతరాలను తొలగించి అందరికీ సమాన విద్యను అందించాలని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఆయా మండలాల ఎంఈవోలతో సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని సాధించిన ఎమ్మెల్యేను పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనితవిజయ్, నాయకులు గుర్రం కేశవులు, కల్లు రమణారెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, యాదయ్యగౌడ్, ఎంఈవోలు సత్కరించారు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి నివేదికలివ్వాలని ఎమ్మెల్యే ఎంఈవోలను ఆదేశించారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు మూత్రశాలలు, తాగునీటి వసతికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించేందుకు ప్రభుత్వం సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఖానాపూర్‌లో 20ఎకరాల్లో త్వరలోనే స్కూల్ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే ఆమనగల్లులో జూనియర్ కళాశాల నిర్మాణ పనులూ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లు సర్దార్‌నాయక్, సత్యనారాయణ, చంప్లానాయక్, పాండు, నాయకులు యాదయ్య గౌడ్, సురేందర్‌రెడ్డి, బాబు, నర్సింహ, నరేశ్‌నాయక్, రవీందర్, హన్మనాయక్, యాదగిరి రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు


వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న శంకర్, నాయకులు

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

కడ్తాల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండలంలో సోమవారం ఆయన పర్యటించి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పీసీసీ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడిగా నియమితులైన వంశీచంద్ రెడ్డిని కాంగ్రెస్ ఎస్సీసెల్ కల్వకుర్తి నియోజకవర్గ చైర్మన్ పోతుగంటి శంకర్, పారిశ్రామికవేత్త కొర్పోలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వంశీచంద్ మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తామన్నారు. మరే రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందన్నారు. అవినీతి, అక్రమాలతో అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని, విపక్షాల కుట్రలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు చేగూరి వెంకటేశ్, అశోక్, నంద్యానాయక్, నరేందర్, రామకృష్ణ, జగన్, సత్యం, యాదయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ చట్టం చేసే వరకు ... గ్రూప్స్ ఫలితాలు ప్రకటించొద్దు

తలకొండపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు అన్ని గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల ఫలితాలు నిలిపివేయాలని తలకొండపల్లిలో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. ఉద్యోగ పరీక్ష ఫలితాలు నిలిపివేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని మాజీ జడ్పీటీసీ పద్మనర్సింహ ప్రారంభించారు. దీక్షలకు పలు సంఘాల నేతలు, నాయకులు సంఘీభావం తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి నియామకాలు చేపడితేనే మాదిగలు, ఉప కులాలకు రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణ లేకుండా ఉద్యోగ నియామకాలు చేపడితే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. మాలల ఒత్తిళ్లకు తలొగ్గి సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు తుడుం శ్రీను, నాయకులు రామచంద్రయ్య, కుమార్, యాదయ్య, సుధాకర్, నారాయణ, రాజు, సంజీవ, మార్కండేయ, గణేశ్, మహేశ్, గోపాల్, శ్రీశైలం, శేఖర్, రజనీకాంత్, బాల్‌రాజ్, వంశీ, రవితేజ పాల్గొన్నారు.

నవాబుపేట: ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్-1, 2ఫలితాలను ప్రభుత్వం నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకులకు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఖదీర్, నర్సింహారెడ్డి, వడ్ల రాములు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహులు, చంద్రం, జానీ, కిష్టయ్య, బద్రి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలకు రక్షణేది?

- పరిగిలో 29 పార్కు స్థలాల గుర్తింపు
- కూలిపోతున్న ఉద్యాన స్థలాల రక్షణ గోడలు
- ప్రహరీల గ్రిల్స్, పైపులు దొంగలపాలు
- కొన్ని కాలనీల్లో పార్కు జాగాల కబ్జా
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు

పరిగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పరిగి మున్సిపల్ పరిధి పార్కుల స్థలాలకు రక్షణ కరువైంది. పరిగి పట్టణం ఏటేటా విస్తరిస్తోంది. కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. వెంచర్లలో నిబంధనల ప్రకారం వదిలే పార్కు స్థలాల నిర్వహణ లేకుండాపోతోంది. పార్క్ స్థలాల చుట్టూ ప్రహరీలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఐదారేళ్ల నుంచి మునిసిపల్ పరిధి 15వార్డుల్లో కొత్త కాలనీల్లో 29 చోట్ల పార్క్ స్థలాలను గుర్తించారు. వాటిల్లో మూడింటిలోనే మొక్కలు పెంచుతున్నారు. అయితే మొక్కలకు నీరు కూడా పోయడంలేదు. కొన్ని పార్కులకు పైప్‌లతో ప్రహరీలు, కొన్నింటికి ఫెన్సింగ్ వేశారు. అయితే వాటిపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేక కబ్జా అవుతున్నాయి. ప్రహరీలు కూలుతున్నాయి. ప్రహరీలను కూల్చి వాటికమర్చిన పైప్‌లు, గ్రిల్స్‌ను ఎత్తుకపోతున్నారు. ఇలా తిరుమల, మైత్రీ వెంచర్ల పార్కుల్లోని పైపులు, గ్రిల్స్ చోరీ అయ్యాయి. దీనిపై మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి వదిలేశారు. పట్టణంలో 29చోట్ల పార్కు స్థలాలున్నట్లు రికార్డుల్లో ఉన్నా.. వాస్తవంగా పదిలోపు స్థలాలకే ఫెన్సింగ్ వేశారు. మిగతావాటికి రక్షణే లేదు. ఆ స్థలాలు ఎక్కడున్నాయో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు కూడా తెలియదు. పార్కు స్థలాల్లో కొందరు రియల్టర్లు, స్థానికులు కబ్జా చేస్తున్నారు. అధికారులు వెంటనే పట్టణంలో గుర్తించిన పార్కు స్థలాల చుట్టూ ప్రహరీలు, ఫెన్సింగ్ వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


మైత్రీనగర్‌లో కూలిన పార్కు ప్రహరీ


తిరుమల రెసిడెన్సీలో నిర్వహణ లేని పార్కు స్థలం



మైత్రీనగర్‌లో కళా విహీనంగా మారిన పట్టణ ప్రకృతి వనం

స్థలాలకు ఫెన్సింగ్ వేస్తాం



పరిగి మునిసిపల్ పరిధిలో 29చోట్ల పార్కుల స్థలాలను గుర్తించాం. మూడు చోట్ల మొక్కలు పెంచుతున్నాం. మరో మూడు పార్కుల్లో మొక్కలు నాటుతాం. పార్కుల గ్రిల్స్, పైపుల చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. పట్టణంలోని అన్ని పార్కు స్థలాల గుర్తించి వాటికి ఫెన్సింగ్ వేసేలా చర్యలు తీసుకుంటాం.

- వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, పరిగి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రంగారెడ్డి అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లిలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.11 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు సీసీరోడ్డు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విడతల వారీగా గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గ్రామంలో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలి



కందుకూరులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ సీతారాం

కందుకూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): యువత సమాజం పట్ల సేవాభావాన్ని అలవర్చుకోవాలని.. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం చలి వేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని సీఐ సీతారాం అన్నారు. సోమవారం కందుకూరులో ఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై సైదులు, నాయకులు సరికొండ పాండు, ఎగ్గిడి సత్తయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండాకాలం ప్రారంభంలోనే ఎండలు విపరీతంగా కొడుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై కాలినడకన, వాహనాల్లో వచ్చే ప్రయాణికులకు మంచినీటిని అందుబాటులో ఉంచేందుకు ఎంఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మోటె రమేష్ సభ్యులు పాములు రవీందర్, చిందం ప్రశాంత్, కందడి శ్రీనివాస్, పట్నం సురేష్ కందుకూరులోని చిన్నరోడ్డుపై ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సేవాకార్యక్రమాన్ని చేపట్టడానికి యువకులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సరికొండ జగన్, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బీసీ హాస్టల్ భవనం

(5వ పేజీ తరువాయి)

ఎస్టీలు ఎక్కువై బీసీ విద్యార్థులు తక్కువయ్యారు. ఈ క్రమంలో 120 మంది విద్యార్థులున్న వసతి గృహాన్ని సొంత భవనంలో వసతులు లేక, కూలిపోయే దశకు చేరుకోవడంతో 2016లో కల్వకుర్తిరోడ్డులో అద్దె భవనంలోకి మార్చారు. అక్కడ ఏడాదికే సరైన నీటి వసతి, ఇతర సౌకర్యాలు లేక విద్యార్థుల సంఖ్య సగానికి పడిపోయింది. ఇదిలా ఉంటే అప్పట్లో స్థానిక ఎస్సీ హాస్టల్లో కూడ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో జిల్లా ఉన్నతాధికారులు కొందరు వసతి గృహ అధికారుల ఒత్తిడితో పిల్లలు లేనిది అద్దె భవనంలో వసతి గృహాన్ని నడపడం వల్ల అద్దె వృథా అని బీసీ వసతి గృహాన్ని అద్దెభవనం నుంచి 2017లో ఎస్సీ వసతి గృహంలోకి మార్చారు. క్రమంగా బీసీ విద్యార్థులు తగ్గడం, స్థానికులు చొరవ తీసుకోకపోవడంతో గుట్టుచప్పుడుగా అధికారులు 2018లో ఆమనగల్లు బీసీ వసతి గృహాన్నే ఎత్తివేశారు. దీంతో కోట్ల రూపాయలు విలువ చేసే వసతి గృహ పాత భవనం, స్థలం వృథాగా మారాయి. భవనం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. బీసీ హాస్టల్ భవనం స్థానంలో దుకాణ సముదాయం నిర్మించిన మున్సిపాలిటీకి భారీ ఆదాయం చేకూరుతుంది. బీసీ హాస్టల్ స్థానంలో బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని గతంలో పాలక ప్రజాప్రతినిధులు పేర్కొన్న ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

ఆదర్శం సావిత్రీబాయి పూలే జీవితం

షాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళల తేజోమూర్తి, భారత తొలి ఉపాధ్యాయురాలు, తొలి సామాజిక విప్లవకారిణి, కులవ్యవస్థకు చమరగీతం పాడిన సావిత్రీబాయిపూలేను ఆదర్శంగా తీసుకోవాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో చదువుల తల్లి సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి, నాయకులు రాహుల్‌గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి, ఖాజాపాషా, గౌరీశ్వర్, రాఘవేందర్, నర్సింహులు, ప్రభాకర్ రెడ్డి, అంజయ్య, రాంరెడ్డి, కిషోర్, సత్తయ్య, మహేందర్, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



షాబాద్: నివాళులర్పిస్తున్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళులు

షాద్‌నగర్ అర్బన్: ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట సావిత్రీబాయి పూలే విగ్రహానికి టీజేఏసీ, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయి పూలే సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో టీజేఏసీ నాయకులు జనార్దన్, కరుణాకర్, అర్జున్‌కుమార్, నర్సింహులు, రాము, రవీంద్రనాథ్, కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, బస్వం, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఎమ్మార్వో ఆఫీసు ఎదుట సావిత్రీబాయి పూలే విగ్రహానికి ఎంఈఓ మనోహర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఉపాధ్యాయులు నర్సింహులు, చంద్రశేఖర్, బిజిలి సత్యం, లక్ష్మీ దేవమ్మ, సురేందర్, కృష్ణయ్య, బాలయ్య, కృష్ణవేణి పాల్గొన్నారు. షాద్‌నగర్ బీసీ సేన ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ప్రశాంత్, కత్తి చంద్రశేఖర్, బాస వరలక్ష్మి, మేకల వెంకటేష్, రవి, శివ, సురేందర్‌గౌడ్, సౌజన్య, మమత పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: నేటితరం మహిళలు సావిత్రీ బాయి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బ్యాగరి ప్రభాకర్ అన్నారు. సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలోని సావిత్రీబాయి విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎంజాల వినోద్, ప్రవీణ్, యాదగిరి, శ్రీనివాస్, గణేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, ఉపాధ్యాయులు దుర్గామని, జ్యోతి, సుభద్ర, నాగసంధ్య, ఉన్నారు.

కరువు.. దరువు!

(5వ పేజీ తరువాయి)

ఎండిన వరిపైర్లలో మూగజీవాలను మేపుతున్నారు. వరి సాగు కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచాల మండల పరిధిలో 33 వేల ఎకరాల భూములు ఉండగా, అందులో 28 వేల ఎకరాలు సాగుకు అనువైనవి ఉన్నాయి. ఇందులో వివిధ గ్రామాల పరిధిలోని 10 వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. కాగా, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది 4 వేల ఎకరాల్లో వరి, 500 ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు తదితర ఆరుతండి పంటలు సాగు చేశారు. మరో 200 ఎకరాల వరకు బొప్పాయి, మామిడి ఇతర తోటలు ఉన్నాయి.

పాతాళంలోకి భూగర్భజలాలు

రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో మంచాల మండల పరిధిలోని చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేదు. దీంతో భూగర్భజలాలు పాతాళంలోకి పడిపోయి బోర్లలో నీటిలభ్యత లేకుండా పోయింది. దీంతో పొట్టదశకు వచ్చిన వరి చేను ఎండుముఖం పట్టింది. తిప్పాయిగూడ, ఎల్లమ్మ తండా, తాళ్లపల్లిగూడ తదితర గ్రామాల పరిధిలో పరిస్థితి మరీ దుర్భరంగా మారింది. ఆయా గ్రామాల పరిధిలో ఇప్పటికే 200 ఎకరాల వరకు



మంచాలలోని తిప్పాయిగూడలో ఎండుతున్న వరి

వరి పైరు పూర్తిగా ఎండిపోయింది. మరో 200 ఎకరాలు ఎండిపోయే దశకు చేరుకుంది. అంతేకాకుండా నీటిలభ్యత లేక బొప్పాయి తదితర తోటలు వట్టిపోయే దశకు చేరుకోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే 20 శాతం పంటలు కూడా చేతికి వచ్చే అవకాశం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇదీగాక కరువుతో పశుగ్రాసం కొరత ఏర్పడి పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పచ్చిమేత దొరకక అవస్థ పడుతున్నారు. స్థానికంగా పశుగ్రాసం లభించక మిర్యాలగూడ, మెదక్ తదితర ప్రాంతాల నుంచి లారీలు, డీసీఎంలలో ఎండుగడ్డిని కొని తెచ్చుకుంటున్నారు. ఇందుకోసం పాడిరైతులు లారీకి రూ.30వేల ఖర్చు చేయాల్సి వస్తోంది. పచ్చిమేత దొరకక ఎండుగడ్డిపైనే ఆధారపడుతున్న రైతులకు ఆదాయం తగ్గిపోయి నష్టాల పాలవుతున్నారు.

మొన్ననే కొత్తబోరు వేసిన



పాతబోరులో నీరు రాకపోవడంతో మొన్ననే కొత్తబోరు వేశాను. దీనికి రూ.లక్ష వరకు ఖర్చు అయ్యింది. కొత్త బోరులో పాత మోటరు దింపడంతో రెండు రోజుల పాటు మోస్తరుగా నీరు పోసింది. తర్వాత నీరు రావడం లేదు. మెకానిక్‌ను అడిగితే 'బోరు 600 ఫీట్ల లోతు ఉండటంతో మోటరు కాలిపోయింది. అంత లోతు నుంచి మోటరు నీరు గుంజడం లేదు. కొత్తమోటరు తేవాలె' అంటున్నడు. పైపులు పీకి గడ్డమీద వేసిన. మోటరు కొనాలంటే లక్ష రూపాయలు కావాలే. ఎక్కడినుంచి తేవాతో తోస్తలేదు.

-మంతని రవిరాజు, రైతు, అస్మత్‌పూర్

నీటి లభ్యత లేకనే...

రెండేళ్లుగా వర్షపాతం తక్కువగా ఉంది. భూగర్భ జలాలు తగ్గిపోయాయి. సాగు కూడా తక్కువగా ఉంది. నీటి లభ్యత లేక వేసిన కొద్దిపాటి పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. తిప్పాయిగూడ, తాళ్లపల్లిగూడ, ఎల్లమ్మతండా తదితర గ్రామాల్లో పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉంది.

- లింగస్వామి, ఏఈవో, మంచాల

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయపోల్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు క్లింకార ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, ఫౌండేషన్ చైర్మన్ గుడివాక లక్ష్మి, ఎంఈవో హీర్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ఆమనగల్లు, మార్చి10(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని సూర్యలక్ష్మీ కాటన్‌మిల్ వద్ద సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ మజ్దూర్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్మిక నాయకురాళ్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి లక్యనాయక్, ఉపాధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. మహిళా కార్మిక నాయకురాళ్లను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రావు, మాలిక్, అలివేలు, సామయ్య, రాములమ్మ పాల్గొన్నారు.

చౌదరిగూడ: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తోటి ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు కుషాల్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, మహేష్ నరేందర్ పాల్గొన్నారు.

ఆమనగల్లు: ఆత్మస్థైర్యమే ఆయుధంగా మహిళలు ముందుకు సాగి అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో కుసుమ మాధురి, సీడీపీవో శాంతిరేఖ, ప్రజ్వల ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ అన్నారు. ఆమనగల్లు రైతు వేదిక వద్ద ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రాజెక్ట్‌లో ప్రతిభ కనబరిచిన అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సుజాత, సహాయకులు మంగమ్మ, సరస్వతిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, కేజీబీవీ స్పెషలాఫీసర్ పద్మజ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రజ్వల సిబ్బంది సురేశ్‌కుమార్, ఉమ, అంబర్‌సింగ్, మిథాలిరాజ్, రోజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఆమనగల్లు: మిఠాయిలు పంచుతున్న మహిళలు

చారిటబుల్ ట్రస్టు ప్రారంభం

శంషాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరాలయంలో సోమవారం శ్రీరాజేశ్వరగౌడ చారిటబుల్ ట్రస్టును బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌తో కలసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు.



పూజా కార్యక్రమంలో గౌడనేతలతో మంత్రి పొన్నం, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

చేవెళ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేశంపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాల పంచాయతీ తులవానీ గడ్డ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుమతమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. కేశంపేట మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రీనివాస్, సుధాకర్, కృష్ణ, సత్తజీ, సాయిలు, శ్రీశైలం, మహేశ్ ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కడ్తాల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్మాస్‌పల్లి రామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో సీతారామచంద్రస్వామి, శివపార్వతులు, సరస్వతీదేవి ఆలయాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. నిర్వాహకురాలు లీలాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రముఖ వేదపండితుడు మేళ్లూరి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోర్పోలు విజయభాస్కర్ రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హన్మనాయక్, బీక్యానాయక్, శంకర్, కేశవులు, జగన్, రామకృష్ణ, రాజు, మనోహర్‌రెడ్డి, నరేందర్, బీచ్యానాయక్, చేగూరి వెంకటేశ్, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హోమంలో లీలాలక్ష్మారెడ్డి దంపతులు

సంక్షిప్తంగా..

గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

యాచారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని గున్‌గల్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో రూ.30లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాశ మల్లయాదయ్య, బుచ్చి రెడ్డి, దనరాజ్, కన్నరెడ్డి, మధుసూదన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

ఆమనగల్లు: ఆరెకటిక సంఘం మహాసభను మంగళవారం నిర్వహిస్తున్నామని ఆ సంఘం మండల అధ్యక్షుడు సుభాష్ తెలిపారు. రాష్ట్ర ఆరెకటిక కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా సభకు సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. నాయకులు రాజశేఖర్, నర్సోజీ, రమేశ్, నాగేశ్, బబ్లు, శంకర్ ఉన్నారు.

బోరు మోటార్ ప్రారంభం

తలకొండపల్లి: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సహకారంతో తలకొండపల్లి మండలం సడక్ తండాలో తాగునీటి ఇబ్బందులు తొలగాయి. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు దోమమోహన్ రెడ్డి సహకారంతో రూ.30 వేలతో బోరు మోటర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి బోరు మోటార్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ కండె ఓంకారం, పీఆర్‌వో ఎంఏ పాషా, సభ్యులు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, దేశ్యానాయక్, మహేశ్, నర్సింహ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

షాబాద్: గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య అన్నారు. మండల పరిధిలోని సంకేపల్లిగూడ గ్రామంలో రూ.5 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సోమవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, నర్సింహులు, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సీపీఐ శత జయంతి ఉత్సవాలు

మహేశ్వరం: భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి దత్తునాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం తుక్కుగూడలో నిర్వహించే వేడుకలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ హరగోపాల్, పాశం యాదగిరి హాజరవుతున్నారని పేర్కొన్నారు.

శుక్లపక్ష ఏకాదశితో ఆధ్యాత్మిక శోభ

చేవెళ్ల: శుక్ల పక్ష ఏకాదశిని పురస్కరించుకొని చేవెళ్ల పట్టణ కేంద్రంలో రామభక్తులు హనుమాన్ చాలీసా పారాయణం, తారక మంత్రం జపిస్తూ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి భజన మండలి అధ్యక్షుడు మల్గారి నరోత్తంరెడ్డి మాట్లాడుతూ.. బ్రహ్మ ముహూర్తం కాలంలో సంకీర్తన చేస్తే మానసిక ఆనందం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు అనంతరెడి ఉన్నారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

కడ్తాల్: మండలంలోని రావిచెడ్ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజారోహనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం స్వామివారి కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు విఠలయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, నిర్వాహకులు తిరుమల ఇంజమూరి రామానుజాచార్యులు, ఆచార్య ఆదిత్య, చిదంబర శర్మ, పుట్టపాక రాంచందర్‌రావు, కాంత్రికిరణ్ పాల్గొన్నారు.

ఉత్తర ద్వారం ఏర్పాటు

కడ్తాల్: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు మేళ్లూరి వెంకటేశ్వర శర్మ, శ్రీధర్ ఆధ్వర్యంలో ఉత్తర ద్వారానికి బిగించిన తలుపులను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన రాంచంద్రయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో వనపర్తి జిల్లా గోపాల్‌పేట్‌కు విందుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. పెద్దషాపూర్ వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు నడుపుతున్న కొడుకు భాస్కర్ బలంగా ఢీకొట్టాడు. దీంతో పక్క సీట్లో కూర్చున్న తండ్రి రాంచంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల సీట్లో కూర్చున్న పద్మ, అలవేలుకు తీవ్ర గాయలయ్యాయి. గుర్తించిన వాహనాదారులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

కడ్తాల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలోని సర్వే నంబర్ 321/1 ప్రభుత్వ భూమిలో ఆదివారం రాత్రి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అన్మాస్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా మట్టిని పుల్లేరు బోడుతండాకు చెందిన నేనావత్ శ్రీను, గాన్గుమర్ల తండాకు చెందిన మునావత్ శ్రీను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వరప్రసాద్ అక్కడికి చేరుకొని నాలుగు లారీలు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. లారీలు, జేసీబీ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

ఇబ్రహీంపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద సోమవారం ఆల్టో కారును ఎదురుగా వస్తున్న కోళ్ల వ్యాన్ ఢీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కథనం ప్రకారం.. యాచారం మండలం గున్‌గల్ గ్రామానికి చెందిన మహేశ్వర్(40) మహేశ్వరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం తన ఆల్టో కారులో ఇబ్రహీంపట్నం నుంచి స్వగ్రామమైన గున్‌గల్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కోళ్ల వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో మహేశ్వర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం అతడిని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం: కేసు నమోదు

కేశంపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామానికి చెందిన పెద్దిని మధు(25) అదృశ్యమైనట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు. ఈ ఏడాది జనవరి 3న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. మధు డబ్బుల కోసం ఇంట్లో కుటుంబ సభ్యులతో తరుచూ గొడవ పడేవాడని, డబ్బులు ఇవ్వకుంటే అలిగిపోయి తర్వాత వచ్చే వాడని తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో జీన్స్ ప్యాంట్, బ్లూ కలర్ ఫుల్ టీ షర్ట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. నల్లని రంగు, కోల మొఖంతో ఉంటాడని వివరించారు. జనవరిలో వెళ్లిన మధు తిరిగి రాకపోవడంతో సోమవారం తల్లి పెద్దిని పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాన్నారు.

ఆధార్‌తో మృతదేహం ఆచూకీ లభ్యం

కేశంపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముల్‌నర్వ పంచాయతీ చౌదరిగూడ శివరులోని సర్వే నంబర్ 527లో పడి ఉన్న మృతదేహం మిస్టరీ వీడింది. ఆధార్ కార్డు సాయంతో మృతదేహం ఆచూకీని పోలీసులు కనుక్కున్నారు. ఆదివారం చౌదరిగూడ శివారులో పడిఉన్న మృతదేహాన్ని కేశంపేట సీఐ నరహరి పరిశీలించారు. తల, మొండెం వేరుగా ఉండడంతో హత్యగా భావించిన పోలీసులు, పరిసరాలను పరిశీలించారు. ప్యాంటు జేబులో దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్లకు చెందిన బేరి జంగయ్య(57)గా గుర్తించారు. ఖాళీ సీసాలు ఏరుకుంటూ జీవనం సాగించే జంగయ్య పది రోజుల క్రితం ఈ ప్రాంతానికి వచ్చి ఫిట్స్‌కు గురై చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. అయితే కుక్కలు మృతదేహాన్ని పీక్కు తినడంతో మృతదేహం నుంచి తల, మొండెం వేరు పడిందని తెలిపారు. సోమవారం శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

కేశంపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏఐఎంఎస్ ఒలంపియాడ్ హంట్ 2024-25లో కేశంపేట మండలం ఇప్పలపల్లి వీబీపీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో పాఠశాలకు చెందిన ఒకటో తరగతి విద్యార్థిని ఆధ్య జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు సాధించింది. 5వ తరగతికి చెందిన సాయి చరణ్ జోనల్ స్థాయిలో 7వ ర్యాంకు, 6వ తరగతికి చెందిన శశాంక్ వర్మ జోనల్ స్థాయిలో 10వ ర్యాంకు సాధించారు. వీరికి షాద్‌నగర్ పట్టణంలోని రవీంద్ర భారతీలో సోమవారం ఏఐఎంఎస్ ఒలంపియాడ్ డైరెక్టర్ నవీందర్ మెమొంటో, షీల్డ్, సర్టిఫికెట్ అందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, సౌమ్య అభినందించారు.

నెలాఖరులోగా పన్నులు వసూలు చేస్తాం

ఇబ్రహీంపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఈ నెలఖరు వరకు లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ అన్నారు. బకాయిలతో కలిసి రూ.11.78 కోట్లు రావాల్సి ఉందని, వీటిలో ప్రభుత్వ సంస్థలకు సంబంధించి రూ.2.86 కోట్లు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.3.50 కోట్లు పన్నులు వసూలైనట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరులోపు బకాయిలు చెల్లించకపోతే మున్సిపల్ సేవలకు బంద్ చేస్తామంటూ హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే గ్రూప్స్ ఫలితాలివ్వాలి

యాచారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేసేదాక గ్రూప్- 1, 2, 3తోపాటు అన్ని రకాల ఉద్యోగాల ఫలితాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన దీక్షలు చేపడుతున్నామని, దీక్షలకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు. మంగళవారం యాచారంలో నిరసన దీక్షలు చేపడుతున్నామన్నారు.

29న షాద్‌నగర్‌లో కవి సమ్మేళనం

షాద్‌నగర్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ గ్రేడ్-1 గ్రంథాలయంలో ఈనెల 29న విశ్వవసు నామ ఉగాదిని పురస్కరించుకుని కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 'భారతీయ సంస్కృతి- మహా కుంభమేళ ప్రాశస్త్యం' అంశంపై కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కల్గిన వారు కవి సమ్మేళనంలో పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు.

ఎమ్మార్పీఎస్(ఎంఈఎఫ్) నూతన కమిటీ

కందుకూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్(ఎంఈఎఫ్) డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి సురేందర్ తెలిపారు. సోమవారం ఆ కమిటీకి నియామక పత్రాన్ని అందజేసి మాట్లాడారు. డివిజన్ గౌరవ అధ్యక్షుడిగా యశ్వంత్(డిప్యూటి తహసీల్దార్) అధ్యక్షుడిగా యాదగిరి, ప్రధానకార్యదర్శిగా జె.కృష్ణ, కోశాధికారిగా శ్రీను, ఉపాధ్యక్షుడిగా రాందాసు, సహాయ కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బాల్‌రాజులను ఎన్నుకున్నారు.